## క్లుప్తంగా

### హామీ ఇస్తే అమలు చేస్తాం



ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

**రేగోడ్(మెదక్):** కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇస్తే అమలు చేస్తుందని, మాట తప్పని ప్రభుత్వం అని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మరో రెండు గ్యారంటీ పథకాలను అమలు చేసిన సందర్భంగా రేగోడ్‌లో బుధవారం కాంగ్రెస్ శ్రేణుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదగిరి, కో ఆ ప్షన్ సభ్యుడు చోటుమియా తదితరులు పాల్గొన్నారు.

### బీవీ రాజు విద్యార్థులకు ఉత్తమ ప్రాజెక్టు అవార్డు

**నర్సాపూర్:** తమ కాలేజీ విద్యార్థులకు ఉత్తమ ప్రాజెక్టు అవార్డు వచ్చిందని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌దూబె తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27, 28 తేదీల్లో కేరళలోని కొట్టాయంలోని సెయింట్ గిట్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగులో జరిగిన పదవ జాతీయ స్థాయి టెక్నికల్ ప్రాజెక్టు ఎగ్జిబిషన్, పోటీల్లో తమ కాలేజీకి చెందిన సివిల్ ఇంజనీరింగు బ్రాంచ్ విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. బ్రాంచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సంగమేశ్ బిరదార్ ఆధ్వర్యంలో సివిల్ ఇంజనీరింగు బ్రాంచ్ విద్యార్థులు భానుతేజ, ప్రశాంత్, సాయి భాను ప్రసాద్ చారి, సందీప్‌కుమార్‌ల ప్రాజెక్టుకు ఉత్తమ ప్రాజెక్టు అవార్డు వచ్చిందని విద్యార్థులను అభినందించారు.

### ఆలయంలో చోరీ



ఆలయంలో వివరాలు తెలుసుకుంటున్న సీఐ వెంకటేశ్

**వెల్దుర్తి(తూప్రాన్):** మండల కేంద్రంలోని మాసాయిపేటలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. రాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి అమ్మవారి అలంకరణకు ఉపయోగించిన బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. దాతల సహకారంతో ఆలయం గర్భగుడి, పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాగా సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్క్ సైతం దొంగలు ఎత్తుకెళ్లారు. చోరీ ఘటనతో సుమారు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు గౌడసంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, రామాయంపేట సీఐ వెంకటేశ్, చేగుంట ఎస్ఐ బాలరాజు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

### విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కోణం విఠల్

**పెద్దశంకరంపేట(మెదక్):** నారాయణఖేడ్‌లో గురువారం ఉదయం చేపట్టనున్న విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు విఠల్ కార్యకర్తలు, అభిమానులను కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ గెలవడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. నారాయణఖేడ్‌లోని నిర్వహించే విజయ సంకల్ప యాత్రకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి, మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి, ఇతర నాయకులు హాజరవుతారని, ఈ యాత్రకు మండలం నుంచి అధికసంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, విజయ్, అంజయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండల కేంద్రం కౌడిపల్లిలోని సీఎస్ఐ చర్చి ఆవరణలో బుధవారం సికింద్రాబాద్ వెస్లీ చర్చి పీటర్ ఇన్‌చార్జి కె.జి.సుశీల్ విక్టర్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు బ్యూలా, జేమ్స్ అజీమ్, సంధ్య, ప్రణీత్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన రోగులుకు మందులు అందించారు. కార్యక్రమంలో కౌడిపల్లి చర్చి ఫాస్టర్ రెవరెండ్ జి.జైపాల్, ఆఫీస్ బేరర్స్ జ్ఞానప్రకాశ్, భూషణం, ఏసు, శ్రీనివాస్, రాజు, ప్రమోద్, విజయ్‌లు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్షలను నిర్వహించారు.



చేగుంట మోడల్ పాఠశాలలో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థినులు



కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులను చెక్ చేస్తున్న ఇన్విజిలేటర్లు



పెద్దశంకరంపేట(మెదక్): హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పాపన్నపేట(మెదక్): విద్యార్థులను స్క్రీనింగ్ చేస్తున్న దృశ్యం



చిన్నశంకరంపేట(మెదక్): హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

# సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి



నర్సాపూర్: ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

**వెల్దుర్తి(తూప్రాన్):** ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతీ ఒక్కరు సైన్స్‌పై అవగాహన పెంచుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి ఆకాంక్షించారు. వెల్దుర్తి ఉమ్మడి మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. మాసాయిపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి సందర్శించి విద్యార్థులను అభినందించారు.

**సృజనాత్మకత వెలికి తీసేందుకు దోహదం**

**నర్సాపూర్:** సైన్స్ ఫెయిర్ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడుతుందని విష్ణు ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జామి చెప్పారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులు ఆవిష్కరించిన పలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

**రామాయంపేటలో..**

**రామాయంపేట(మెదక్):** రామాయంపేటలోని వివేకానంద, మంజీరా విద్యాలయాల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. కార్యక్రమంలో రెండు స్కూళ్ల కరస్పాండెంట్లు రాంకుమార్, జితేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పాపన్నపేట(మెదక్):** మండలంలోని కుర్తివాడ, నాగ్సాన్‌పల్లి పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం రాంకిషన్, టీచర్లు పాల్గొన్నారు.

**నార్సింగిలో ..**

**చిన్నశంకరంపేట(మెదక్):** నార్సింగి జెడ్పీపాఠశాలలో విద్యార్థులు తమ ప్రదర్శనలు నిర్వహించారు. నార్సింగి మండల నోడల్ విద్యాధికారి రామకృష్ణా, హెచ్ఎం మురళిమోహన్, సైన్స్ టీచర్స్ దీప, స్వప్న, శివరాములు, లావణ్య పాల్గొన్నారు.

**సూరారంలో...**

మండలంలోని సూరారం జెడ్పీపాఠశాలలో విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీపాఠశాల హెచ్ఎం సాయిరెడ్డి, గ్రామ నాయకులు పవన్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

**టేక్మాల్(మెదక్):** మండలంలోని బొడ్మట్‌పల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరరావు, శివ శంకర్, ఇందిర, అర్చన, రాణి, రాధిక పాల్గొన్నారు.

**చేగుంట(తూప్రాన్):** మండలంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కొల్చారం(నర్సాపూర్):** రంగంపేట ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ వేదికను నిర్వహించారు.

**పెద్దశంకరంపేట(మెదక్):** మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌ను మండల నోడల్ అధికారి, హెచ్ఎం వెంకటేశం ప్రారంభించారు.

**విద్యార్థులు టెక్నాలజీలో ఎదగాలి**

**మనోహరాబాద్(తూప్రాన్):** విద్యార్థులు టెక్నాలజీలో ఎదగాలని డిప్యూటీ తహసీల్దార్ కౌషిక అన్నారు. మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలతో పాటు కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో, రంగాయపల్లిలో, కూచారం, ముప్పిరెడ్డిపల్లి, పర్కిబండ గ్రామాల్లో సైన్స్ వేడుకలను నిర్వహించారు.

**నిజాంపేట(మెదక్):** నిజాంపేట మండల పరిధిలోని నస్కల్, చల్మెడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో నోబెల్ అవార్డు గ్రహీత భారతరత్న సర్ సి వి రామన్ జన్మదిన సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుదవారం నాడు విద్యార్థుల చేత సైన్స్ అంశాలపై వివిధ రకాల ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ పరికరాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సాగరిక, ఎల్లయ్య, ఉపాధ్యాయులు రజని, మన్మథ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు

**విద్యార్థులు మేధో శక్తిని పెంపొందించుకోవాలి**

**హవేళిఘణాపూర్(మెదక్):** విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకోవాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. మండలంలోని కూచన్‌పల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు చేసిన సైన్స్ ప్రదర్శనలను ఆయన తిలకించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, యంగ్ స్టార్స్ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు, సౌమ్య, మౌనిక, సౌజన్య, ఉపాధ్యాయులు వనజాక్షి, మల్లారెడ్డి, ఎల్లం, రామానుజన్, మధుసూదన్, కేశవ్ పాల్గొన్నారు.

**వెల్మకన్న ఉన్నత పాఠశాలలో..**

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండల పరిధిలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ డే సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్, ఉపన్యాస, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ కార్యక్రమంలో హెచ్ఎం సరోజ, ఉపాధ్యా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పాపన్నపేట(మెదక్): కుర్తివాడలో ..



రామాయంపేటలో..



వెల్దుర్తిలో..

# నర్సాపూర్‌లో అభివృద్ధి నిల్

కాంగ్రెస్ నేత రాజిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**నర్సాపూర్:** బీఆర్ఎస్ హయాంలో నర్సాపూర్‌లో అభివృద్ధి శూన్యమని, నియోజకవర్గం చాలా వెనకపడిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆరోపించారు. ఆయన డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో పాటు పలువురు నాయకులతో కలిసి పట్టణంలో పర్యటించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... నిధులున్నా నర్సాపూర్‌ను అభివృద్ధి చేయలేకపోయారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. జిల్లాను సిరిసిల్ల జోన్‌లో కలిపి జిల్లా ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు అన్యాయం చేశారని చెప్పారు. కాగా ఉమ్మడి జిల్లాకు వచ్చిన నిధులను మాజీ మంత్రి హరీశ్ రావు సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలకు తరలించి జిల్లాలోని మిగతా నియోజకవర్గాలకు అన్యాయం చేశారని తెలిపారు. పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తాము ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వంతో అమోదింపచేసి పనులు చేపట్టేలా కృషి చేస్తామని అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు అబద్ధాలు చెప్పారని, ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ప్రస్తుత ఎమ్మెల్యే సునీతారెడ్డికి చిత్తశుద్ధి లేదని, పదవుల కోసం కాంగ్రెస్‌ను వీడారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రిజ్వాన్, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌గుప్తా, సురేశ్, రషీద్, మల్లేశ్‌యాదవ్, చిన్న అంజిగౌడ్, ఉదయ్‌కుమార్, రవికుమార్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

# అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించండి



మంత్రి కొండా సురేఖను కలిసిన రాష్ట్ర అర్చక సంఘం ప్రతినిధులు

**పెద్దశంకరంపేట(మెదక్):** అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర అర్చక సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి అర్చకుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా 6,700 మంది అర్చకులకు వేతనాలు విడుదల చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గత అక్టోబర్‌లో నూతనంగా రాష్ట్ర వ్యాప్తంగా 450 మంది అర్చకులు నియమితులయ్యారని, వారి వేతనాలు కూడా వెంటనే విడుదల చేయాలని తెలిపారు. అర్చకులకు ఉద్యోగ భద్రత, ప్రతీ నెల వేతనాలు అందజేయాలని విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్చకసంఘం ఉపాధ్యక్షుడు గుడి చంద్రశేఖరశర్మ, కార్యదర్శి వెంకటాద్రి స్వామి, వర్కింగ్‌ప్రసిడెంట్ ఫనికుమార్ శర్మ, సిరిసిల్లా జిల్లా అధ్యక్షుడు సంతోష్‌శాస్త్రి, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బసవలింగం, అమరేశ్వర్, రాజేశ్వరశర్మ, శివప్రసాద్, శ్రీనివాచార్యులు, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ తదితరులున్నారు.

# ఆడపిల్లలను కాపాడుదాం.. చదివిద్దాం

జెండర్ స్పెషలిస్ట్ నాగమణి



మాట్లాడుతున్న జెండర్ స్పెషలిస్ట్ నాగమణి

**నర్సాపూర్‌రూరల్:** సమాజంలో ఆడపిల్లలను రక్షించడంతో పాటు మంచి విద్యను అందిద్దామని జెండర్ స్పెషలిస్ట్ నాగమణి తెలిపారు. బుధవారం మండలంలోని రెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో బేటి బచావో - బేటి పడవో క్యాంపెయిన్ ప్రోగ్రాం నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మెదక్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలును చదివిద్దాం (బేటి బచావో - బేటి పడవో) గురించి వివరించారు. సుకన్య సమృద్ధి యోజన పథకం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, చైల్డ్ మ్యారేజ్, చైల్డ్ ట్రాఫికింగ్, చైల్డ్ లేబర్, పోక్సో యాక్ట్‌ల గురించి ఫైనాన్షియల్ లిటరీస్ రమేశ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, డిస్ట్రిక్ హబ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ టీం జెండర్ స్పెషలిస్ట్ కవిత, నాగమణి, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

# ఘనంగా స్వయంపాలన దినోత్సవం



కౌడిపల్లి(నర్సాపూర్): బాలికల మినీ గురుకులంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండల కేంద్రం కౌడిపల్లి బాలికల మినీ గురుకుల పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులు, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులను హెచ్ఎం జమునారాణి, ఉపాధ్యాయ సిబ్బంది సరోజ, లలిత, ప్రమీల, మాధవి, శోభారాణి, వైష్ణవి, శైలజ, కవిత అభినందించారు.

**మాడ్చెట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో..**


**పెద్దశంకరంపేట(మెదక్):** మండల పరిధిలోని మాడ్చెట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



పెద్దశంకరంపేట(మెదక్): మాడ్చెట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ..

## సంక్షిప్త వార్తలు

### ◆ వ్యక్తి అదృశ్యం



రమేశ్ (ఫైల్)

**టేక్మాల్(మెదక్):** వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని రంగన్నపల్లి మదిర గ్రామం రంగన్నపల్లిలో బుధవారం జరిగింది. ఏఎస్ఐ దయానంద్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఇట్టిగారి రమేశ్(38) వ్యవసాయంతో పాటూ, కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడిన రమేశ్ ఈనెల 13 మద్యం సేవించి ఇంటికి రాగా భార్యతో గొడవ జరిగింది. దీంతో అతను కోపంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. 15 రోజులైనా తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంటి నుంచి వెళ్లినప్పుడు తెలుపు రంగు లుంగీ, నలుపు రంగు చొక్కా ధరించినట్లు తెలిపారు. భార్య తులశమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

### ◆ ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు సన్మానం

**రామాయంపేట(మెదక్):** ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌లో బుధవారం స్నేహా కళాశాలల కరస్పాండెంట్ సత్యనారాయణ సన్మానించారు. కార్యక్రమంలో స్నేహా కళాశాలల ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

### ◆ చికిత్స పొందుతూ మహిళ మృతి

**హవేళిఘణాపూర్(మెదక్):** ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఎలుకల మందు సేవించి ఆత్మహత్యాయత్నంకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ తండాలో చోటు చేసుకుంది. సుల్తాన్‌పూర్‌కు చెందిన ముడావత్ సుర్తి(48) ఈ నెల 25న ఎలుకల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసుకోగా ఆమెను కుటుంబీకులు వెంటనే మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### ◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**అల్లాదుర్గం(మెదక్):** మండల పరిధిలోని ముప్పారం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సీసీ రోడ్డు పనులకు బుధవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేషారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విఠల్, దత్తురెడ్డి, కృష్ణ, నాగరాజు, దుర్గయ్య, సాయిలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ◆ శివ పడిపూజ మహోత్సవం



**శివ్వంపేట(నర్సాపూర్):** మండల కేంద్రం శివ్వంపేటలో బుధవారం గురుస్వాములు, శివస్వాముల ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు, పడిపూజ మహోత్సవం నిర్వహించారు. శివస్వాములు కాశీకి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి గణేశ్‌గౌడ్, వివిధ గ్రామాల శివ మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

### ◆ ఘనంగా బండ్ల ఊరేగింపు

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండలంలోని కంచన్‌పల్లి గ్రామంలో యాదవసంఘం ఆధ్వర్యంలో మల్లన్న ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మకు బండ్లను, బోనాలను ఊరేగించి సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

### ◆ ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

**చేగుంట(తూప్రాన్):** మండలంలోని బీకొండాపూర్ లక్ష్మీనర్సిహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఊరేంగించారు. నాయకులు రాజిరెడ్డి, ఎంపీటీసీ నవీన్ స్వామివారికి పట్టు వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, దుబ్బాక కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీల నాయకులు, ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

### ◆ హామీల అమలుపై హర్షం

**టేక్మాల్(మెదక్):** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి కాకముందే నాలుగు హామీలు నెరవేర్చడంతో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పకుండా ఉచిత హామీలను అమలు చేస్తు వస్తుందన్నారు.

### ◆ దర్జీలకు సన్మానం

**చేగుంట(తూప్రాన్):** మండల కేంద్రం చేగుంటలో టైలర్స్‌డే సందర్భంగా దర్జీలకు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకుడు పరంజ్యోతి, దర్జీలు బోగరాజు, ముత్యం, వెంకటేశం, శ్రీశైలం శ్రీను, ప్రభాకర్, సాయి, వేణు, కృష్ణ, మల్లయ్య, రవి, కృష్ణ, నరేందర్ ఉన్నారు.

### ◆ దరఖాస్తుల ఆహ్వానం

**నర్సాపూర్‌రూరల్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ పోస్టు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో నెట్/సెట్/పీహెచ్‌డీ కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు మార్చి 2వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మార్చి 4న మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుదన్నారు. వివరాలకు 9581367394 నంబరును సంప్రదించాలన్నారు.

### ◆ మాజీ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలి

**మెదక్ మున్సిపాలిటీ:** విధులు నిర్వర్తిస్తున్న తమను అకారణంగా దూషిస్తున్న మాజీ కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు, సిబ్బంది బుధవారం కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని మాజీ కౌన్సిలర్ మేడి మధుసూదన్ రావు మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహించే తమపై అకారణంగా దూషిస్తున్నాడని ఆరోపించారు. ఈ సందర్భంగా మున్సిపల్ జానకీరాం సాగర్‌తోపాటు చైర్మన్ చంద్రపాల్‌కు వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు.